
కథకుడి కథ: **రమణ కథ**



అతని పేరు వెంకటాద్రి.

"తెలుగుమాటని విరిచి, ఆ చివరో ఈ చివరో మరో భాషాపదాన్ని తొడిగి హాస్యం పుట్టిస్తే అదెంతకాలం నిలిచేను? అసలది హాస్యమా? అపహాస్యంకాని" అన్నకవి సామ్రాట్‌ను నిలేసి తెలుగులోనే నవ్వు సాధించగలిగిన వాకానాక గోదావరిజిల్లా పడుచు కుర్రాడిదాపేరు. గత దశాబ్దంగా తెలుగుదేశాన్ని హాస్యంతో వెర్రెత్తించిన పిల్లోడిది.

అతన్ని అందరూ, ముళ్ళపూడి వెంకట రమణ అంటారట!

అల్లవారియింటి ఆడపడుచు, యించక్కా తలంటి పోసుకుని, ఆరినకురుల్ని బులబులాగ్గా అల్లుకుని, చంద్రవంకలాంటి నుదుటమీద కుంకుమ అద్దుకుని, లోకంలోని సర్వచైతన్యాన్నీ ఆకట్టగల ఆకర్ణాంత విశాల నేత్రాల అంచుల్ని కాటుకతో దిద్దుకుని, పొద్దుట అన్నయ్యో తమ్ముడో కొని తెచ్చిన పత్రిక చేతపట్టుకుని, వొయ్యారంగా శుక్రవారం సాయంత్రప్పూట డాబా పిట్టగోడ దగ్గర వించుంటే-

"రాధమ్మలా లేదుటా?" అన్నాడు నవయువకుడు ముగ్ధుడై. అదివిన్న ఆపిల్ల కోపంతో నాసాపుటాలెగరేస్తే "అచ్చు అలానేవుంది సీమ్మ" అన్నాడు హాడిలి కొయ్య బారి,

ఆ పక్కనించే, కాళ్ళనీ, వెనకపడిపోయిన మనసునీ లాగుతూ ఈడుస్తూ పోతున్న ఆనందరావు, అది విని, 'రాధమ్మంటే.... అల్ల వెంకట్రమణ....' అని తలపోసి, ఉసురుతెచ్చుకుని, వొక్కక్షణం నిలబడి, నిస్త్రాణ పోగొట్టుకుని, ఇంటి దగ్గర తన రాక కోసం, తనుతెచ్చే రూకల కోసం, ఆర్నెల్ల కిందట పెళ్ళయిన

## సారసాక్ష

కొత్తల్లో కొన్న పుస్తకంలోని 'లహరి' చదువుకుంటూ కూచునే ఆలివితల్చుకుంటూ భావిమీద ఆశ పెంచుకుంటూ కదిలిపోయాడు - ఆపళానే ఎదురింటో బామ్మగారు ఘనవరాలు వినిపించిన 'చుట్టాలొచ్చారు' తల్చుకు తల్చుకు నవ్వటం గమనించి, గర్వంగా (?) ఛాతి విరుసుకుంటూ.

అవి అతిశయోక్తులు కావు.

అతన్ని మొదటి సారిగా చూసినప్పుడు 'ఇదేమిటీ ఇతనిలా వున్నాడు? అనుకున్నాను. అతని కథలు చదివిన మీదట చాలామందికి కలిగినట్టే నాకు ముళ్ళపూడి వెంకట రమణ అంటే రకరకాల వూహలు కలిగాయి. టిప్‌టాప్‌గా బట్టలు తొడుక్కుని ఛట్ ఛట్‌మంటూ ఉంటాడని అనుకున్నాను అలాంటిది తెల్లటి పోపెన్ షర్టు తొడుక్కుని, పైజమా తొడుక్కుని కనపడితే వొక్కక్షణం ఆశ్చర్యపోయాను ఆ తర్వాత అతన్తో ఎలా మాటలు ప్రారంభించాలో అర్థంకాలేదు. కొంతసేపటిదాకా. మెల్లిగా వూపిరి పీల్చుకుని "మీ 'ఛాయలు' కథ నాకు చాలా బాగా నచ్చిందండీ?" అన్నాను "అలాగా?" అన్నాడతను భిడియంగా నవ్వుతూ.

నాకు ఆ కథ ఎందుకు బాగుందోచెప్పి మొదటిసారి కలుసుకోవటమే అయినా చనువుగా "రాజకీయ బేతాళ కథలు బాగులేవండీ" అనికూడా అన్నాను. అదే భిడియపూరితమైనచిరునవ్వునవ్వి వూరుకున్నాడు.

వ్యక్తిగా ముళ్ళపూడి వెంకటాద్రివు చాలా సరళ హృదయుడు. అరమరికలూ అతిశయాలూ లేనివాడు. అత్యంత స్నేహపాత్రుడు. పైగా చమత్కారంగా మాట్లాడగల నేర్పు ఉన్నవాడు. చమత్కారంగా మాట్లాడటం అంటే తెచ్చికోలుగా ఏవో పదాలు పలకటంకాదు స్వభావ సిద్ధంగా అతనిలోఉన్న హాస్యప్రియత్వం సరళంగా సహజంగా మనకు అతనిమాటల్లో గోచరిసుంది.

రమణ అభిప్రాయాలుకూడా అంత సరళంగానూ, నిర్మొహమాటంగానూకూడా ఉంటాయి ఇందుకు అతను ఏడు సంవత్సరాలపాటు నడిపిన శీర్షికలే తార్కాణం. చేతికివొచ్చింది సినిమా శీర్షికేఐనా, సినిమా విమర్శలూ అంటే "డిటో" అనే భావన పోగొట్టాడు అతను. అతను బాగున్నదన్న సినిమాను తామూ బాగున్నదని అనకపోయినా బాగోలేదని మాత్రం అనటానికి ప్రయత్నించనివార్ని నేనెరుగుదును. అతను ఎందుకు బాగున్నదని చెబుతున్నాడో ఆ కారణం సవాలు చెయ్యటానికి సర్వసాధారణంగా అతీతంగా వుండేది.

సినిమా విమర్శల గురించీ నేనూ అతనూ అనుకున్నాము. నామిత్రుడొకతను తీసిన సినిమా ఏమీ బాగోలేదని

(తరువాయి 18 వ పేజీలో)

## రమణకథ

(16 వ పేజీ తరువాయి)

'మంగమ్మ శపథం' మార్కు దేశవాళీ తర్జుమా అని అతను కుండ పగలకొట్టినట్లు రాసేశాడు. ఆ తర్వాత ఆ సినిమా ఆర్థికంగా బాగా దెబ్బతిన్నది. ఆసంగతి ప్రస్తావించి "మీరు ఏమాత్రం కనికరం చూపినా మరో నాలుగు రాళ్ళు ఆ నిర్మాతకి గిట్టేవేమో?" అన్నాను. "నాకూ అలాగే అనిపిస్తుంది గాని తలాతోకా లేని సినిమాల్ని ఎలా కనికరించగలను చెప్పండి. కనీసం అందులో ఏమాత్రమైనా సరుకు అంటూ వుంటే, కనబడితే పోనీలే అనైనా అనుకోగలను" అన్నాడు. నిజమే ననిపించింది. విమర్శ అన్న తర్వాత నిర్మొహమాటంగానే ఉండాలి. రమణ విమర్శలు అలాగే వుండేవికూడా. కోములు తిరిగినవాళ్లుతీసిన సినిమా అయినా అతడు బాగుండకపోతే క్షమించలేదు అందుకు "పెళ్ళినాటి ప్రమాణాలు" మీదా, "అప్పుచేసి పప్పుకూడు" మీదా వెలిబుచ్చిన అభిప్రాయాలే నిదర్శనాలు.

అంతేకాదు. అతను సహాయ సంపాదకత్వం చేపట్టి, పత్రికలో ప్రవేశ పెట్టిన ప్రతికొత్తశీర్షికా పఠితల మనసులను సూరగొన్నది. అనితర సాధ్యమైన శైలి అతనిది. ఆ శైలిని ఏ గుప్తనామం వెనుక దాచినా మరుగుపడలేదు.

అయితే ఒక విమర్శ ఉన్నది. రచయిత తానుచేసే ప్రతి రచనలో ఏదోవొక కళాత్మకమైన ప్రయోజనం చూపించాలి అని. అంటే రచనద్వారా ఏదోవొక సూత్రం పఠితలకు అందాలన్నమాట. ఆ ప్రయోజనం రమణ కథల్లో ఉండదన్నదే ఆ విమర్శ.

ఆ విమర్శ పునాదుల్లేనిదని అననుగాని తొందరపాటు మాట మాత్రం అవునని అనుకుంటున్నాను. జీవితమే పాఠాలుగా చదువుకున్న రమణ కథల్లో ప్రయోజనం లేకపోవటమన్నది యింతవరకూ జరగలేదు, ఒక్క ఋణానందలహరి మినహాయింపుగా. నిరుద్యోగి ఆనందరావు కథ కోటిమంది నిరుద్యోగుల నిజజీవితానికి దర్పణం. జీవితంలో దెబ్బలుతిని అసమర్థులుగా తయారైన మహారాజుల్నీ, యువరాజుల్నీ అతను అనితర సాధ్యమైన ప్రతిభతో చిత్రించాచి, తెలుగుకన్నె హృదయాన్ని, గృహిణీత్వాన్ని (అతను అవివాహితుడైనా!) రాధమ్మలో మనం చూడవచ్చు. అప్పుడే యౌవనంలోకి అడుగుపెట్టి జీవితాన్ని రంగు రంగుల కలలుగా చూసుకునే యువకహృదయాల భగ్నవీణలనూ, బాష్పకణాలనూ అతనొక్కడే చిత్రించ గలిగాడు. ఇదంతా సాహిత్య ప్రయోజనమేకాకపోతే మరేదీకాదు.

పోతే శిల్పదృష్ట్యా అతనికథలు అంత గొప్పవికాదన్న విమర్శ వొకటి ఉన్నది. అదికూడా కొంతవరకూ సవరణయోగ్యమే. ఆకలి, ఆనందరావు, లహరి, మహారాజు యువరాజు, జనతా ఎక్స్‌ప్రెస్‌తో దీటయిన కథాశిల్పంగల కథలు మనం ఎన్నో చదివి వుండలేదన్నది నిర్వివాదం. గుండెలనుపిండి వెయ్యగల కారుణ్యాన్ని, కర్కశత్వాన్ని "సాక్షి" లో కనినంతగా మరెందులోనూ నేను కనలేదు. అది శిల్పం కాదని అనటం సాధ్యం కాదనుకుంటాను.

మరి ఆ రెండు విమర్శలూ ఎందుకు వొచ్చాయి? రమణమీద ప్రేమా, అభిమానమూ కలవారే అలా అనటం జరుగుతోందికదా? అందుకు కారణం నాకు ఒక్కటె కనిపిస్తున్నది. ఏకారణంచేతనో గాని అతను "వేట" లాంటి కథలు కొన్ని రాశాడు. "ఇద్దరమ్మాయిలు, ముగ్గురబ్బాయిలు" లాంటి నవలికలు రాశాడు. అవి చదివి నవ్వుకున్నా అందులోని హ్యూమరు తెలుగుది కాదనిపించటం ఒక కారణం కావచ్చును, లేక అతని గొప్ప కథల ప్రక్కని యివి ఎందుకూ అనిపించవచ్చును. అది సహజం మరి ఒక రచయిత అన్నట్లు గొప్పవాడి గొప్ప రచనలు కొద్దిగానే ఉంటాయి. అన్నీ ఆ స్థాయిలో ఉండకపోవటం ఆ రచయిత చేతగానితనం అనుకోలేము. రచయితల స్థితిగతులు తెలిసిన వారెవరూ అనుకోరు కూడా.

ప్రస్తుతం రమణ సినిమాలోకంలో చేరిపోయాడు. రచయితగా అతని ఎదుగుదలకు ఆ "మాలోకం" అంత దోహదకారి కాదనిపించ వచ్చును కాని ఆర్థికమైన సమస్యలు తీరతాయికదా? రచయితగా, జర్నలిష్టుగా అతన్ని ఆదరించినవారు సినిమా రచయితగాకూడా ఆదరించగలరన్న నమ్మకం నాకు ఉన్నది.

మరొక్కమాట.

ఒకసారి మాటల సందర్భంలో ఏదో జోక్ చెప్పారు మిత్రులు నండూరి రామమోహనరావుగారు అది ఎక్కడో రమణ రాసినట్టు గుర్తున్నాను. ఆయనది విని నవ్వి "ఈరమణతో చెడ్డచిక్కొచ్చి పడిందండీ! మనం సరికొత్త జోక్ అనుకున్నది అతను ఏడాదిక్రితం రాసేసి వుంటాడు." అన్నారు.

అంతకన్నా గొప్ప కాంప్లిమెంట్ ఎవరివ్వగలరు?

శ్రీ యోగాశ్రమము
పెదవాల్తేరు
విశాఖపట్టణము - 3

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

వివరములు తెలియగోరువారు ఒక రూపాయి పంపవలయును.